
ప్రజాశక్తి
సోమవారం 17 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం



గుమ్మలక్ష్మీపురంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం మండలంలో అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి నెలలో ఇంత అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రత నమోదు కావడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే ఎండల తీవ్రత ప్రభావం ఏ విధంగా ఉందో అర్థమవుతుందని అంటున్నారు. ఉదయం 11 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జీడికి గిట్టుబాటు ధర ఏదీ?

- మూడేళ్లుగా తగ్గుతున్న జీడి దిగుబడి
- మద్దుతు ధర, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆదివాసీల ప్రధాన జీవనాధారం పంట జీడి. ఎక్కువ శాతం మంది గిరిజనులు జీడి పిక్క.. బతుకు పక్క అనే నినాదంతో ఈపంటపైనే ఎక్కువగా ఆశలు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. గిరిజనులు నమ్ముకునే ప్రాధాన్యత పంటకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడంతో ప్రతి ఏటా దళారుల బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారు. చింతపంట తర్వాత జీడి పంట గిరిజనుల జీవన విధానంలో ప్రధాన భాగస్వామ్యమైంది. జీడిపంటతో ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీలుంటుందని ఆశ. ఆ ఉద్దేశంతో పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజనులు అత్యధికంగా జీడి పంటను సాగు చేస్తున్నారు. జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో సుమారు 70వేల ఎకరాల్లో జీడి సాగవుతుంది. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 50వేల ఎకరాల్లో జీడిపంట ఉండగా అందులో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో 35 వేలు ఎకరాల్లో జీడి తోటలు విస్తారంగా ఉన్నాయి. ప్రతి ఏటా పదివేల క్వింటాళ్లు జీడి దిగుబడి వస్తోంది. దీన్ని బట్టి చూస్తే గిరిజన రైతులు జీడి పంటపై ఎంత మేర ఆధారపడి ఉన్నారో అర్థమవుతుంది. పుష్కలమైన జీడి తోటలు ఉన్నప్పటికీ మద్దతు ధర లభించకపోవడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందలేకపోతున్నారు.

నేడు ఐటిడిఎ వద్ద 48గంటల పాటు ధర్నా

గుమ్మలక్ష్మీపురం, సాలూరు మండలాల్లో జీడి పిక్కల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, 80 కేజీల జీడి పిక్కల బస్తా రూ.16 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17,18 తేదీల్లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో 48గంటల పాటు పార్వతీపురం ఐటిడిఎ వద్ద ధర్నా జరగనుంది. అలాగే గిరిజనుల ప్రధాన సమస్యలైన పోడు పట్టాలివ్వాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, సాగునీటి వనరులు కల్పించాలని, అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ ధర్నా జరగనుంది.

మూడేళ్లుగా తగ్గుతున్న జీడి దిగుబడి

గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో జీడిపంట దిగుబడి గత మూడేళ్లుగా తగ్గుతూ వస్తుంది. పంట సమయంలో అధిక వర్షాలు కురవడం, కారు మబ్బులు కారణంగా జీడి పంట దిగుబడి రావడంలేదని గిరిజన రైతులు తెలిపారు. ఈ ఏడాది కూడా జీడి పూత మాత్రమే కనిపిస్తోందని, పిందే దిగుబడి లేదని రైతులు చెబుతున్నారు. కారుమబ్బుల కారణంగా ఈ ఏడాదీ జీడిపంట దిగుబడి ఆశాజనకంగా ఉండే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు సరైన గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు.

ముందుకు రాని ప్రభుత్వ సంస్థలు

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ప్రతి ఏటా జీడి పంట వ్యాపారం కోట్లాది రూపాయలు జరుగుతున్నా జిసిసి, ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలుపై దృష్టి సారించడం లేదు. దీంతో దళారులు బెడద ఎక్కువ కావడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. మరోవైపు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. చింతపండుతో పాటు జీడి పంటను కూడా గతంలో జిసిసి అధికారులు కొనుగోలు చేసేవారు. అయితే సంస్థకు నష్టాలు వచ్చాయని కొనుగోలు నిలిపివేశారు. దీంతో చేసేది లేక అప్పటి నుంచి గిరిజనులు జీడి పంటను వర్తక వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది.

దృష్టి సారించని అధికారులు

ఏజెన్సీలో గిరిజన రైతుల ప్రధాన పంట జీడి అయినప్పటికీ పంట సాగును అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని గిరిజన రైతులు ఆరోపిస్తున్నారు. పూత రాలకుండా అధికారులు రాయితీపై పురుగు మందులు అందజేసి పంట సాగుకు అవగాహన కల్పించే చర్యలు ఎక్కడా కానరావడం లేదని అంటున్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పర్యటనకే పరిమితం తప్ప సలహాలు, సూచనలు ఇవ్వడం లేదని చెబుతున్నారు.

మూలనపడ్డ జీడి ప్రాసెసింగ్ యూనిట్లు

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభానికి నోచుకోకుండానే మూలనపడ్డాయి. గిరిజనులు సేకరించిన జీడిపిక్కలను ప్రాసెసింగ్ చేసేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి పరికరాలను కొనుగోలు చేశారు. ప్రాసెసింగ్ విధానంపై కొంతమంది గిరిజన యువత, మహిళలకు శిక్షణ కూడా అందించారు. వీటికి రూపకల్పన చేసిన అప్పటి ఐటిడిఎ పిఒ సువర్ణపండాదాస్ బదిలీపై వెళ్లడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

కేజీ జీడి రూ. 200కు కొనుగోలు చేయాలి

కేజీ జీడి పిక్కలకు ప్రభుత్వం రూ. 200 ప్రకటించి జిసిసి ద్వారా కొనుగోలు చేయాలి. పంట చేతికి వచ్చే సమయంలో దళారుల బెడద నుంచి గిరిజనులు రక్షించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. జీడి పంట పూత సమయంలో తేనెమంచు ఎక్కువగా కురవడంతో పంట దిగుబడి తగ్గింది.

మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి.

జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

గుమ్మలక్ష్మీపురంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. గిరిజన యువతీ యువకులకు ఉపాధి కల్పించాలి. వ్యవసాయ యాజమాన్య పద్ధతుల్లో జీడి పంటలపై అవగాహన కల్పించాలి.

కోలక అవినాష్ ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- పకడ్బందీగా ఏర్పాట్లు
- పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఉచిత బస్సు ప్రయాణం



బెంచీలపై హాల్‌టిక్కెట్ల నెంబర్లు వేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఈనెల 17 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో రెగ్యులర్, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 10455 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ వీరిలో బాలురు 5055 బాలికలు 5312 ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షల్లో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్, బిసి వెల్ఫేర్, కేజీబీవీ మున్సిపల్, గిరిజన సంక్షేమ, రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ, ప్రైవేట్ అనైడెడ్ యాజమాన్యాలకు సంబంధించి 220 పాఠశాలల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, ఫర్నీచర్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి తరగతి గదికి 24 మంది విద్యార్థులు చొప్పున నెంబరింగ్ వేశారు. ఇన్విజిలేటర్లుగా మొదట దశలో 436, రెండో దశలో 436 మంది ఉపాధ్యాయులు వ్యవహరిస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, మాస్ కాపీయింగ్ జరగకుండా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. అలాగే 67మంది చీఫ్‌సూపరింటెండెంట్లు, 67మంది డిపార్ట్మెంటల్ అధికారులుగా ఉపాధ్యాయులను నియమించారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షలు జరుగుసమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత అధికారును ఇప్పటికే కలెక్టర్ అప్రమత్తం చేశారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు , అవసరమైన మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. ఉద్రిక్తతలు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేశారు.

ఆటోలే ఆధారం

వీరఘట్టం : మండలంలోని గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రానికి కత్తుల కవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, రేగులపాడు కెజిబివి విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలంటే ఏ విధమైన వాహన సదుపాయాలు లేకపోవడంతో ఆటోలనే ఆశ్రయించి పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి వస్తుంది. అలాగే బిటివాడ పరీక్షా కేంద్రానికి వండవ, ఎంసింగపురం, బడ్డుమాసింగి విద్యార్థులు, నీలానగరం పరీక్షా కేంద్రానికి తలవరం, తెట్టంగి విద్యార్థులు ప్రయివేట్ వాహనాలనే ఆశ్రయిస్తున్నారు. రహదారి సౌకర్యాలు ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో ఈ గ్రామాలకు బస్సు సౌకర్యాలు ఉన్నప్పటికీ అప్పట్లో అధికారులు ఏ కారణంచేత రద్దు చేశారు అర్థం కాని పరిస్థితి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బస్సు సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సిసి కెమెరా నిఘాలో పరీక్షలు : డిఇఒ

సిసి కెమెరా నిఘాలో టెన్త్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎన్.తిరుపతి నాయుడు తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి ఇన్విజిలేటర్లు సైతం సెల్‌ఫోన్లు తీసుకుంకూడదని స్పష్టం చేశారు. పరీక్షకు వచ్చే విద్యార్థులకు హాల్ టికెట్లు చూపిస్తే ఆర్టీసి బస్సు ప్రయాణం ఉచితమని, దీన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. గంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. పరీక్ష జరిగే కేంద్రాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి 5 వరకు స్కూళ్లు నిర్వహించాలి.

అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలో ప్రతివారం జరిగే వారపు సంతను ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ ఉత్పత్తులైన కొండచీపుర్ల అమ్మకాలు, రేట్లను గిరిజనుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అటవీ ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు చేయాలని జీసీసీ మేనేజర్లను పిఒ ఆదేశించారు. గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిసిసి మేనేజర్లు కృష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అధికారులు

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు

ప్రజాశక్తి - పార్వతీపురం

అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం చిరస్మరణీయమని కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బి సి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటుకు ప్రధాన కారణం పొట్టి శ్రీరాములు అన్నారు. "సబర్మతి ఆశ్రమంలో పొట్టి శ్రీరాములు సేవ చరిత్రాత్మకమైనది. ప్రేమ, వినయం, సేవ, నిస్వార్థత లు కలిగిన మహానుభావుడు శ్రీరాములు అని కొనియాడారు. తన కర్తవ్యదీక్షలను ఉత్సాహంగా నిర్వహిస్తూ ఆశ్రమంలో అందరి మన్ననలనూ, గాంధీ ఆదరాన్నీ చూరగొన్నారని, సబర్మతి ఆశ్రమంలో రాసి ఉండడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం అన్నారు. శ్రీరాములు వంటి కార్యదీక్షాపరులు పదిమంది ఉంటే ఒక్క ఏడాదిలోనే స్వాతంత్ర్యం సాధించవచ్చునని గాంధీజీ అనేవారని ఆయన చెప్పారు. శ్రీరాములు స్ఫూర్తి అంకితభావం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని ఆయన అడుగుజాడల్లో నడవటం అత్యవసరమని అన్నారు.

కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎస్.కృష్ణ, హాస్టల్ సంక్షేమ అధికారులు ఎస్.సాంబయ్య, దుర్గా ప్రసాద్, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు రాధాకష్ణ, ఉప తాసిల్దార్ చంద్రమౌళి, తదితరులు, పాల్గొన్నారు.

విశ్వాస గండం లేనట్లేనా?

- ముందుకు రాని టిడిపి కూటమి పార్టీలు
- గ్రీన్ సిగ్నల్ ఇవ్వని మంత్రి సంధ్యారాణి
- ఏడాది పీఠం కోసం ఎందుకని నిరాసక్తత

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మపై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేనట్లే కనిపిస్తోంది. ప్రస్తుత పాలకవర్గం పగ్గాలు చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తి కావడంతో అవిశ్వాస తీర్మానం పెడతారనే ఊహాగానాలు కొద్ది నెలల క్రితం వినిపించాయి. అయితే ప్రస్తుతానికి ఆ గండం లేనట్లేననే వాదనలు వినిపిస్తున్నాయి. గత నాలుగేళ్లుగా వైసిపి పాలకవర్గం మున్సిపాలిటీలో పాలిస్తోంది. మున్సిపల్ ఎన్నికలు జరిగిన తొలినాళ్లలో చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా వైసిపి ఉమ్మడి జిల్లా పెద్దల మధ్య కుదిరిన ఒప్పందం అమలు కాకపోవడంతో వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తితో పాటు ఆరుగురు కౌన్సిలర్లు వైసిపిని వీడి జనసేనలో చేరారు. ఇలాంటి పరిస్థితుల్లో చైర్‌పర్సన్‌పై నాలుగేళ్ల తర్వాత అవిశ్వాస తీర్మానం పెడతారనే ప్రచారం గత కొంతకాలంగా జరుగుతోంది. వైసిపి కౌన్సిలర్లలోనూ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ తీరుపై కొంత అసంతృప్తి ఉంది. టిడిపికి చెందిన పట్టణ నాయకుడి భార్య కౌన్సిలర్‌గా వున్నారు. పట్టణంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన ఆ నాయకుడి భార్యను చైర్‌పర్సన్ బరిలో దింపుతారనే ఊహాగానాలు తెరమీదకు వచ్చాయి. ఈనెలతో నాలుగేళ్లు పూర్తికావడంతో అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అవకాశం ఉంది. కౌన్సిల్‌లో 29 మంది కౌన్సిలర్లు ఉన్నారు. టిడిపికి, జనసేనకు చెరో ఆరుగురేసి చొప్పున కౌన్సిలర్లు వున్నారు. కాంగ్రెస్‌కు ఒక కౌన్సిలర్ వున్నారు. మిగిలిన 16మంది కౌన్సిలర్లు వైసిపిలో కొనసాగుతున్నారు. చైర్‌పర్సన్ పై అవిశ్వాసం ప్రతిపాదించడానికి 29మంది కౌన్సిలర్లలో 20 మంది కౌన్సిలర్లు సంతకాలు చేయాల్సి ఉంది. టిడిపి, జనసేన, కాంగ్రెస్ పార్టీలు కలిస్తే 13 మంది కౌన్సిలర్లు అవుతారు. అంటే మరో ఏడుగురు వైసిపి కౌన్సిలర్లను టిడిపి కూటమి పార్టీలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇదంతా జరగాలంటే చైర్‌పర్సన్ పీఠం ఆశిస్తున్న నాయకుడు దండిగా బేరసారాలు నడపాలి. డబ్బులు దండిగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. అయితే ఏడాది పదవీ కాలం కోసం లక్షలాది రూపాయలు ఎందుకు ఖర్చు చేయాలనే ఆలోచనలో ఆశావహ నాయకులు పడినట్లు తెలుస్తోంది.

గ్రీన్ సిగ్నల్ ఇవ్వని మంత్రి

వైసిపికి చెందిన చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మపై అవిశ్వాస తీర్మానానికి స్థానిక మంత్రి సంధ్యారాణి కూడా సుముఖంగా లేరనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏడాది పదవి కోసం ఎందుకు ఇంత హడావుడి చేయాలని ఆమె పార్టీ నాయకులతో చెప్పడంతో విరమించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. మంత్రి సంధ్యారాణి గ్రీన్ సిగ్నల్ ఇస్తే ముందుకు వెళ్దామనే ఆలోచన చేసిన టిడిపి పట్టణ నాయకులు ఆ ప్రతిపాదనను విరమించుకున్నట్లు సమాచారం.

పాలకొండ లో ఫలించని వ్యూహం వల్ల నే

పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నిక విషయంలో వాయిదాల పరంపర కొనసాగుతోంది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయడంతో ఈ పదవికి ఖాళీ ఏర్పడింది. అదే సామాజిక వర్గానికి చెందిన మహిళా కౌన్సిలర్ వైసిపి నుంచి టిడిపిలో చేరారు. అయితే టిడిపికి కౌన్సిల్‌లో ఉన్న బలం చాలా తక్కువ కౌన్సిలర్లే. వైసిపికి మెజారిటీ కౌన్సిలర్లు ఉండడం, చైర్‌పర్సన్ ఎన్నికకు సంబంధించి సమావేశాలకు వారు గైర్హాజరవ్వడంతో పీఠముడి ఏర్పడింది. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ నాయకత్వంలో వైసిపి కౌన్సిలర్లు పట్టుజారకుండా ఉండడంతో టిడిపి వ్యూహాలు బెడిసికొట్టాయి. ఒకవేళ సాలూరు మున్సిపాలిటీ లో అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైతే అలాంటి పరిస్థితే ఎదురు కావచ్చుననే అనుమానాలు టిడిపి నాయకుల్ని వెంటాడుతున్నాయి.ఇక్కడ కూడా వైసిపి ఎక్కువ మంది కౌన్సిలర్లతో పటిష్టంగా వుంది.ఒకవేళ కొంతమంది కౌన్సిలర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేసినా ఆఖరి నిమిషంలో వైసిపి అగ్రనేతలు బొత్స సత్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావు రంగప్రవేశం చేసే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మంత్రి సంధ్యారాణి అవిశ్వాస తీర్మానానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

జనావాసాల మధ్య ఏనుగుల జోన్ ఏర్పాటు తగదు : సిపిఎం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట వద్ద అటవీశాఖ అధికారులు తలపెట్టిన ఏనుగులజోన్‌ను జనావాసాల మధ్య ఏర్పాటు చేయడం తగదని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కొండ చుట్టూ కందకాలు తవ్వడం వల్ల వర్షాకాలంలో గెడ్డలు ద్వారా కొండ చుట్టూ గల రైతుల ఆయకట్టు భూములకు కింది గల చెరువుల్లో నీరు చేరే అవకాశం లేకుండా పోతుందని అన్నారు. ఈ కొండ చుట్టూ గల రైతులు వ్యవసాయ భూములు వర్షాధారంపై ఆధారపడి ఉన్నాయని, కావున తక్షణమే ఏనుగుల జోన్ ఏర్పాటు చేసే ఆలోచనలను జిల్లా అధికారులు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కొండచుట్టూ ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న గిరిజనులు, దళితులు పట్టాలున్న భూములకు రక్షణ కల్పించాలన్నారు. ఈ విషయమై మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు రాజకీయాలకు అతీతంగా పోరాటంలోకి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలకు నష్టం కలిగించే ఏనుగుల జోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాలో ప్రజలంతా పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ నాయకులు రెడ్డి లక్ష్మ నాయుడు, రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, బోరపరెడ్డి అప్పారావు, రెడ్డి రమణమూర్తి పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

మండలంలో కొనసాగిన ప్రజా చైతన్యయాత్ర



గిరిజన గ్రామాల్లో పాదయాత్ర చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గిరిజన గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడు ఈశ్వరరావు కోరారు. సిపిఎం తలపెట్టిన ప్రజా చైతన్యయాత్ర నాయకులు సూక్రు రామారావు, కొర్ర శ్రీనివాసరావు, ఎర్రయ్య, దండి జానకిరాం ఆధ్వర్యాన మండలంలోని పొలంవలస జంక్షన్ నుంచి ఇప్పలవలస మీదుగా కన్నయ్యవలస వరకు పాదయాత్ర ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఎంతో ప్రాధాన్యత కలిగిన గోగాడవలస జంక్షన్ నుంచి కన్నయ్యవలస జంక్షన్ వరకు గల రహదారి పూర్తిగా పాడైపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేటగానివలస వెళ్లే ఉపాధ్యాయులు, ఆశ్రమం పాఠశాలలో చదువుకున్న పిల్లలు నిత్యం నరకయాతన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున వెంటనే రహదారి బాగు చేసి ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రజా రక్షణ యాత్రలో వచ్చిన సమస్యలతో పాటు చిట్టిపురం, తుమ్మరావుపల్లి ప్రాంతాల్లో జమీందారుల పేరుతో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తోకమెట్ట జంక్షన్ నుంచి ఒడిసెలమడకు రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలంతా చైతన్యవంతంగా ఉద్యమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

నేడు కేన్సర్ ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఏరియా ఆసుపత్రిలో సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తారు. విశాఖపట్నం ఆరిలోవలో ఉన్న అపోలో క్యాన్సర్ సెంటర్ సౌజన్యంతో ఉచిత స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవచ్చునని వైద్యులు కోరారు.

నేడు బత్తిలి పంచాయతీ ఆశీల వేలం


ప్రజాశక్తి - భామిని

మండలంలోని బత్తిలి మేజర్ పంచాయతీ ఆశీల వేలంపాటను ఈనెల 17న బత్తిలి సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు, బత్తిలి పంచాయతీ కార్యదర్శి శ్రీను తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొన్న వారు ధరావత్తు రుసుం రూ.50వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు గతంలో పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదని తెలిపారు. సాల్వెన్సీ ఇఒపిఆర్‌డి, డిఎల్‌పిఒ నుంచి పొంది పాటలో పాల్గొనాలని తెలిపారు.

పార్కులు అభివృద్ధి చేయాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం వెరసి పార్వతీపురం పట్టణ ప్రజలు పార్కులకు నోచుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జ్ బత్తిన మోహనరావు, ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, మండల అధ్యక్షులు తెర్లి గౌరీ శంకర్రావు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురం పట్టణం జిల్లా కేంద్రమైనప్పటికీ ఎన్నో ఏళ్ల క్రితం బెలగాం చర్చి వీధిలో ఉన్న ఒకే ఒక్క పార్కు తప్ప ప్రజలకు పార్కులు అందుబాటులోలేవన్నారు. పట్టణం నాలుగు దిక్కులా కొత్త కాలనీలు విస్తరించాయని, ఆయా కాలనీలు ఏర్పాటు చేసిన సమయంలో ఆయా లే అవుట్లలో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు ప్రస్తుతం కానరావడం లేదని అన్నారు. ఆయా స్థలాలు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దాదాపు కబ్జాకు గురయ్యాయని అన్నారు. ఎస్ఎన్ఎం నగర్, ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఉన్న పార్కుల స్థలాలు అభివృద్ధి చేయకపోవడంతో బీడుగా ఉన్నాయన్నారు. ఒక పార్కు స్థలం పశువుల మేతకు ఉపయోగపడుతుండగా, మరో పార్కుస్థలం మున్సిపల్ వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారని అన్నారు. పట్టణ ప్రజలు ఉదయం, సాయంత్రం సమయంలో కాసింత సేద తీరేందుకు పార్కుకు వెళ్దామని ఆశపడుతున్నప్పటికీ పార్కులు లేక నిరాశే ఎదురవుతుందన్నారు. పిల్లలు ఆట పాటలకు పార్కులు అందనంత దూరంలో ఉన్నాయన్నాయని, ఇదంతా టిడిపి, వైసిపి పాలకుల వైఫల్యమేనిని ఆరోపించారు. బెలగాం చర్చి వీధిలో ఉన్న మున్సిపల్ పార్కు బెలగాంలోని కొంతమంది ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. ఇక కొత్తవలస, రాయగడ రోడ్డు, జగన్నాధపురం, వైకెఎం కాలనీ, టౌన్ ప్రాంత ప్రజలతో పాటు కొత్తగా ఏర్పడిన కాలనీలకు చెందిన ప్రజలు పార్కులకు నోచుకోవడం లేదన్నారు. గ్రేడ్-1 మున్సిపాలిటీ, జిల్లా కేంద్రమైన పార్వతీపురంలో పార్కుల అభివృద్ధి చేయకపోవడం అధికారుల, పాలకుల నిర్లక్ష్యానికి తార్కాణమన్నారు. తక్షణమే సంబంధిత పాలకులు, అధికారులు స్పందించి అన్ని ప్రాంతాల్లోని ప్రజలకు అందమైన పార్కులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.



ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను బదిలీ చట్టంలో చేర్చాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గిరిజన సంక్షేమ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను కూడా బదిలీల చట్టంలో చేర్చాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రన్ కోరారు. ఈ మేరకు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీల చట్టంలో పంచాయితీరాజ్ ప్రభుత్వ, మున్సిపల్ ఉపాధ్యాయులను చేర్చారని, అలాగే గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను కూడా ఈ చట్టంలో చేర్చేలా శాసనసభలో చర్చ జరపాలని ఎమ్మెల్యేను కోరామని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయాన్ని జీరో అవర్ ప్రస్తావించి, మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



చైతన్య మానవి మాసనపత్రికను ఆవిష్కరిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ మీనాక్షి

'చైతన్య మానవి' ఆవిష్కరణ

ప్రజాశక్తి - సాలూరు

మహిళా దినోత్సవం సందర్భంగా ప్రచురించిన చైతన్య మానవి ప్రత్యేక సంచికను శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విఆర్ మీనాక్షి, ఆర్ఎంఒ డాక్టర్ కాశీవిశ్వనాథ్ ఆవిష్కరించారు. మహిళల సమస్యలు, పరిష్కారం ఇతివృత్తాలుగా నడుస్తున్న చైతన్య మానవిని ప్రతి ఒక్కరూ ఆదరించాలని సూపరింటెండెంట్ కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కోటేశ్వరరావు

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

ప్రజాశక్తి - కురుపాం

క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని మాజీ జెడ్పిటిసి అంధవరపు కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన కురుపాంలో ఆదివారం నుంచి యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నీకి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో పాటు యువత చదువుల్లో రాణించాలన్నారు. అలాంటప్పుడే యువత ఉన్నత స్థానాల్లో స్థిర పడగలరని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పి.నారాయణరావు, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, గ్రామ పెద్ద బరాటం గుంపసోమి, వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ నూరుల్లా, స్థానిక యువత పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పార్వతీపురం ఐటిడిఎ వద్ద సోమ, మంగళవారాలు తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కోటి కోరారు. ఈ మేరకు మండలంలోని గుమడ సంతలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కోటి, అప్పారావు, లక్ష్మయ్య, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ జీడితో పాటు ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరు మండలాల్లో జీడి పిక్కల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేసి గిరిజన పండించిన జీడి పంట 80 కేజీల జీడి పిక్కల బస్తాలు రూ.16 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని గిరిజన గ్రామాల్లో నీటి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ చెక్ డాములు నిర్మించకపోవడం వల్ల నీరు వృథాగా పోతుందని, కాబట్టి వెంటనే గిరిజన గ్రామాల్లో ఉన్న ప్రతి చెక్ డాంను అధికారులు గుర్తించి వాటిని పూర్తి చేసి సాగునీరందించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

నవరాత్రులకు ముహూర్తపు రాట

ప్రజాశక్తి - సాలూరు

ఈ ఏడాదిలో శ్రీ సీతారామ లీల వసంత నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని 10వ వార్డు నెయ్యిలవీధి, శ్రీరామ మందిరం వద్ద ఆకేటి రామకృష్ణ, లక్ష్మి దంపతులు ఆదివారం ఉదయం ముహూర్తపు రాట వేశారు. కార్యక్రమంలో పలు వీధులు నుండి వందలాది మహిళలు పాల్గొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ప్రతి ఏటా ఈ కార్యక్రమం ఉగాది రోజున ప్రారంభమై 9 రోజులు దంపతులు పూజలు జరిపి శ్రీ రామ నవమి రోజున కళ్యాణం, పట్టాభిషేకంతో ముగుస్తుందని, నిర్వహక ప్రతినిధి టెక్కలి ధర్మారావు తెలిపారు.



వాహన చోదకులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ నారాయణరావు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మూలగూడ జంక్షన్ వద్ద ఆదివారం స్థానిక ఎస్సై పి.నారాయణరావు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేనటువంటి వాహనదారులకు అపరాధ రుసుము వేసి రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి మద్యం సేవించకుండా వాహనాల నడపాలని, ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి భద్రతా నియమాలు పాటించి నడపాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల్లా తాగునీటి పథకాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు పదేపదే అప్రమత్తం చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో ప్రతి ఏటా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పటం లేదు. ఇందుకు మండలంలోని పలు గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న మంచినీటి పథకాలే నిదర్శనం.

మండలంలోని గడగమ్మ, జరడ, బట్టిగూడ, కొంచ, వీరఘట్టం తదితర గ్రామాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడగమ్మలో బోరు బావులు ఉన్నప్పటికీ వాటి ద్వారా వచ్చే నీరు తాగేందుకు పనికి రాకపోవడంతో సమీపంలో ఉన్న నాగావళి నది చెంతకు వెళ్లి చలమల నీటితో దాహార్తిని తీర్చుకుంటున్నారు. కురుపాం మండలం జరడ గ్రామం నుండి 10 కుటుంబాలకు పైబడి కత్తుల కవిటి గ్రామ సమీపంలో పదేళ్ల క్రితం బతుకు తెరువు కోసం వలస వచ్చారు. వీరు నివసించు ఈ ప్రాంతంలో ఓ సంస్థకు చెందిన వారు బోరుబావి ఏర్పాటు చేసినప్పటికీ ఆ బావి నీరు తాగేందుకు పనికి రాకపోవడంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న వంకాయలగెడ్డ, కత్తుల కవిటి గ్రామాలకు ద్విచక్ర వాహనాలతో వచ్చి ప్లాస్టిక్ డబ్బాలతో నీరు తీసుకెళ్లి దాహార్తిని తీర్చుకుంటున్నారు. వండవ ఉపరితల రక్షిత మంచినీటి పథకం నుంచి కొంచ గ్రామానికి అప్పట్లో పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా చేసినా, అది కూడా మూడు రోజులు ముచ్చటగా మారింది. దీతో అక్కడ పైపులైన్ ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తుందని కొంచ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో వందకు పైబడి కుటుంబాలు నివాసం ఉన్నాయి.

ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు



నిరుపయోగంగా ఉన్న వీరఘట్టం బీసీ కాలనీలో రక్షిత మంచినీటి పథకం

గ్రామంలోని బోరు బావులు పని చేయకపోవడంతో సమీప పాఠశాల వద్ద గల బోరు వద్దకు వచ్చి తాగునీరు తీసుకెళ్లి దాహార్తిని తీర్చుకుంటున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. చలివేంద్రి గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా సుమారు రూ.19 లక్షల అంచనా వ్యయంతో 90 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం గత టిడిపి ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. ఈ పథకం కూడా మూడు రోజులు ముచ్చటగా పని చేసి మూలకు చేరింది. దీంతో గ్రామస్తులు రక్షిత మంచినీటి పథకం వద్ద గల బోరుబావి వద్దకు వచ్చి నీరు తోడుకొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఇక వీరఘట్టం మేజర్ పంచాయతీ కార్యాలయం వెనుక నాలుగు లక్షల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసినప్పటికీ ఈ పథకం ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా లేకపోవడంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జలజీవన్ మిషనుతో సమస్య పరిష్కారమయ్యానా?

మండలంలోని 37 గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా లక్షలాది రూపాయల అంచనా వ్యయంతో బోరుబావులతో పాటు, పైప్లైన్ ఏర్పాటు చేసినప్పటికీ ఏళ్ల గడుస్తున్నా వీటి ద్వారా చుక్క నీరు కూడా రాకపోవడంతో ఇవి గ్రామాల్లో ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో పనులు చేపట్టడంతో తాగునీటి సమస్య తీరుతుందన్న ఆశ అడియాశలయ్యాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరఘట్టం బీసీ కాలనీ సమీపంలో రూ.50లక్షలు పైబడి నిధులతో రక్షిత మంచినీటి పథకం పనులు చేపట్టినప్పటికీ అది నిరుపయోగంగా పడిఉంది. ఈ మంచినీటి పథకం నిర్మించక ముందు జామి వారి కాంప్లెక్స్ సమీపంలో రెండేళ్ల పైబడి రూ.2లక్షలతో బోరుబావి తవ్వి అక్కడి నుండి పైప్లైన్ ద్వారా నీటిని మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న రక్షిత మంచినీటి పథకానికి రెక్కించి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు అప్పట్లో పాలకవర్గం ప్రణాళికలు రచించింది. ఈ మేరకు లక్షలాది రూపాయలు వెచ్చించి బోరు బావి తవ్వకాలు జరిపినప్పటికీ వారి ఆశలకు గండిపడడంతో ఆ బోరుబావి నిరుపయోగంగా పడి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచినీటి పథకాలను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



కొంచ గ్రామంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన రక్షిత మంచినీటి పథకం

ఎట్టకేలకు కుటుంబం చెంతకు అప్పారావు

ప్రజాశక్తి - పార్వతీపురం

కొండగొర్రి చుక్కా అలియాస్ కోనేరు అప్పారావు ఎట్టకేలకు కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. ఈ 11న కొండగొర్రి చుక్కా కుటుంబ ఆచూకీ లభ్యమైంది. చుక్క కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌ను కలెక్టరేట్‌లో ఈనెల 11న కలిశారు. కొండగొర్రి చుక్క (అప్పారావు) కోరాపుట్ జిల్లా బంధుగాం బ్లాక్ పెద వల్లాడ పంచాయతీ చిన వల్లాడకు చెందిన వ్యక్తి. చుక్కా తప్పిపోవడంతో భార్య విచారంతో మృతి చెందారు. ప్రస్తుతం చుక్క కుమార్తె దొంబుదొర సాయమ్మ, అల్లుడు దొంబుదొర చందు, పార్వతీపురం మండలం డోకిశీల పంచాయతీ మునక్కాయవలసలో నివసిస్తున్నారు. తన తండ్రికి బాగా చూసుకుంటామని సాయమ్మ, ఆమె భర్త భరోసా ఇచ్చారు. అన్ని నిర్ధారణ చేసుకున్న అనంతరం తమిళనాడు శివగంగై జిల్లా కలెక్టర్‌తో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ మాట్లాడి వెంటనే పార్వతీపురం నుండి ఉప తహాశీల్దార్ కిరీటి, సహాయ కార్మిక అధికారి సిహెచ్ వెంకటేశ్వరరావును చుక్క కుమార్తె, అల్లుడుతో సహా ప్రత్యేక వాహనంలో పంపించారు. అక్కడ అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకుని ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకోగా వారిని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కెహేమలత ఆహ్వానం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. చుక్క ఆరోగ్యం, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చుక్క 20 ఏళ్ల క్రితం రైల్‌లో ప్రయాణిస్తూ టీ తాగుటకు రైలు ఆగిన స్టేషన్‌లో దిగారు. ఇంతలో రైలు కదిలిపోవడం, అతను అక్కడ ఉండిపోవడం జరిగింది. 20 ఏళ్లుగా కుటుంబానికి దూరంగా ఉన్నారు. ఇంతలో తమిళనాడుకి చెందిన అన్నాదురై గొర్రెల కాపరిగా కట్టు బానిసగా చేశాడు. అక్కడ గొర్రెల కాపరిగా పనిచేస్తున్నట్లు తమిళనాడు కార్మిక శాఖ అధికారులు ఈ ఏడాది జనవరి 31న నిర్వహించిన తనిఖీల్లో గుర్తించారు. ఈ విషయం పలు సమాచార మాధ్యమాల్లోనూ ప్రచురితం అయ్యింది. ఈ సందర్భంగా బొండేడ్ లేబర్ చట్టం కింద వసూలు చేసి తమిళనాడు ప్రభుత్వం అందించిన రూ.2 లక్షల చెక్కును, రూ.30 వేల నగదును చుక్కకు కలెక్టర్ అందజేశారు. చుక్క కు ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఆధార్ కార్డు తక్షణమే వచ్చేలా నమోదు చేస్తామని ఆయన అన్నారు. కుటుంబ జీవనానికి అవసరమగు గొర్రెల పెంపకం యూనిట్ మంజూరు చేస్తామని, గృహం అవసరమైతే మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. 20ఏళ్ల తర్వాత కుటుంబంతో కలపడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. కుటుంబ సభ్యులు వచ్చి వివరాలు అందించడం జరిగిందని అన్నారు. చుక్క కు కొత్త బట్టలు అందించారు. కుటుంబంతో కలవడం ఆనందంగా ఉందని చుక్క అన్నారు. సుదీర్ఘ కాలం అనంతరం కుటుంబంతో కలవడం శుభ సూచకమని కుమార్తె, అల్లుడు అన్నారు.



అప్పారావు యోగాక్షేమాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జిల్లా పంచాయతీ వనరుల కేంద్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రూ.2కోట్ల అంచనాలతో నిర్మించబోయే జిల్లా పంచాయతీరాజ్ వనరుల కేంద్రాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, జిల్లా పోలీసు, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలోని జంఝావతి వద్ద మెడికల్ కళాశాలల శంకుస్థాపనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరో 15 రోజుల్లో జిల్లాకు వస్తారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా పార్వతీపురం మన్యం అభివృద్ధిలో వెనకంజలో ఉందని, దీన్ని అభివృద్ధి పథంలో తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని అన్ని వనరులు ఉండేలా జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు ప్రోత్సాహం అందిస్తున్నారని, ఇందులో భాగంగానే రిసోర్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ రిసోర్స్ కేంద్రాన్ని 10 నెలల్లోగా పూర్తి చేయించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ అన్నారు. కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వెంకటరావు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

తెలగా సంక్షేమ సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులుగా కోలా వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షులు రాజనాల వాసుదేవరావు తెలిపారు. ఆదివారం ఆయన అధ్యక్ష తన జరిగిన సమావేశంలో కార్యదర్శిగా ఇనపకుర్తి రాజశేఖర్, కోశాధికారిగా టి.రామ్మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ కాపు కార్పొరేషన్ సహకారంతో తెలగ కులస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేస్తామని, ఈ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.



పొట్టి శ్రీరాములుకు నివాళ్లు అర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఉద్యోగులు

తెలుగు వాడి ఆత్మ గౌరవమే ఆయన పోరాటం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

తెలుగు వాడి ఆత్మగౌరవమే పొట్టి శ్రీరాములు పోరాటమని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పలు విభాగాలు అధికారులతో కలిసి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తెలుగు జాతికి ప్రత్యేక రాష్ట్రం సాధించడానికి ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరజీవి అయ్యారని, రాష్ట్రం కోసం ఆయన ఊపిరి కూడా త్యాగం చేశారని, తెలుగు జాతి కోసమే అంకితమయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, మున్సిపల్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్తు ఎఒ డి వెంకటరమణ పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు వి.శ్రీనివాసరావు, జూనియర్ సహాయకులు ఎ.శ్రీకాంత్, సావిత్రి పాల్గొన్నారు.

పూరిల్లు, రెండు వంటశాలలు దగ్ధం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని రేగులగూడలో పూరిల్లు, రెండు వంటశాలలో ఒక మేకలశాల దగ్ధమైంది. సవర లక్ష్మణరావు పూరిల్లు, రెండు వంటశాలలు ఆదివారం దగ్ధమయ్యాయి. కొత్తూరు అగ్నిమాపక శకటానికి వచ్చేసరికి అప్పటికే లక్ష్మణరావు పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న బట్టలు, నగదు, సామాన్లు, ధాన్యం, బియ్యం అన్నీ కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.3లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. అలాగే సవర రామారావు, సవర చిట్టిమ్మ వంటశాలలు కాలిపోయాయి. అదేవిధంగా మేకల శాల కాలి బూడిదైంది. ఆర్ఐ విజయ గణేష్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు



ఆస్తి నష్టాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ విజయగణేష్

సారా స్థావరాలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పెదఖర్జ శివారులో నాటు సారా స్థావరాలపై ఎల్విన్‌పేట పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1400 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ తెలిపారు. నాటు సారా తయారవుతుందన్న పక్కా సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా నాటు సారా అమ్మకాలు, వంటకాలు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుష్ప శ్రీవాణి, పరీక్షిత్‌రాజును కలిసిన నూరుల్లా

ప్రజాశక్తి - కురుపాం

మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణికి, మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు రాష్ట్ర మైనార్టీ విభాగ సంయుక్త కార్యదర్శి షేక్ నూరుల్లా ఆదివారం చినమేరంగిలో గల తన అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి దుశ్శావాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి ఆశీస్సులతో తన రాష్ట్ర స్థాయిలో మైనార్టీ విభాగంలో పదవి వచ్చిందనకు ధన్యవాదాలు తెలుపుతూన్నానని , వారి సూచనలు, సలహాలు పాటిస్తూ నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైసీపీ నాయకులు శెట్టి నాగేశ్వరరావు, షేక్ ఆదిల్, సర్పంచ్ మన్మధరావు పాల్గొన్నారు.



మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి దంపతులను సన్మానిస్తున్న నూరుల్లా

అగ్ని గంగమ్మ జాతరకు పోటెత్తిన జనం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కోరాపుట్ జిల్లా బందుగాం బ్లాక్ నీలావడిలో ప్రఖ్యాతిగాంచిన అగ్ని గంగమ్మ జాతర ఆది, సోమ, మంగళ వారాల్లో జరగనున్న దృష్ట్యా మొదటి రోజు ఆదివారం, అగ్ని గంగమ్మను దర్శించుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. ఉత్తరాంధ్రకు చెందిన ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలతో పాటు ఒడిశా, చత్తీస్గడ్ రాష్ట్రాల నుంచి భక్తులు ఈ మూడు రోజులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. లక్షలాది మంది తరలివచ్చే ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామని స్థానిక తహశీల్దార్ మోనాలిసా మిశ్రా తెలిపారు. పోలీసులతో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు తాగునీరు, వసతి వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బడే సత్యనారాయణ తెలిపారు. ఈ జాతరను దర్శించుకునేందుకు స్థానిక ఆర్టీసీ డిపో నుంచే రోజుకు ఆరు బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కనకదుర్గ తెలిపారు.



జాతరలో భాగంగా ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం వివిధ పనులకు నిధులు మంజూరు చేస్తుంటే అధికారుల పర్యవేక్షణా లోపంతో కాంట్రాక్టర్ డబ్బులు మిగిల్చుకొనేందుకు నాసిరకం పనులు చేసి మామ అనిపిస్తున్నారు. అది చూసిన ప్రజలు నాణ్యతలేని పనులు చేయడం వల్ల ప్రజాధనం వృథాతో పాటు కొద్ది రోజులకే చేసిన పనులు పనికిరాకుండా పోవడంపై మండలంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో నాణ్యతలేనప్పటికీ సక్రమంగా జరిగినట్లు ఇంజినీరింగ్ అధికారులు ఎం-బుక్ నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత నాణ్యతను పరిశీలించడానికి వచ్చిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా చేసిన పనులు చూసీచూడనట్లు వ్యవహరించి క్వాలిటీ బాగే ఉందని చెప్పి బిల్లుల చెల్లింపునకు సహకరించడంతో కాంట్రాక్టర్‌కు లాభాన్ని చేకూరుస్తున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. మండలంలోని కోటిపాంలో చేసిన పనులే ఇందుకు నిదర్శనం.

మండలంలోని కోటిపాం కాలనీ వద్ద కొండపై ఉన్న సత్యనారాయణ స్వామి దేవస్థానానికి రూ.40 లక్షల నిధులతో సీసీ రోడ్డు మంజూరైంది. ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తి కాంట్రాక్టు పనిచేసేందుకు ముందుకొచ్చారు. అయితే కొండ దిగు ప్రాంతం నుంచి పై వరకు సిసి రోడ్డుతో పాటు రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడ ఏర్పాటు చేయనున్నారు. గుడి పై భాగంలో కూడా ఆలయం చుట్టూ రక్షణ గోడల నిర్మాణం జరుగుతోంది. గత పది రోజులుగా జరుగుతున్న ఈ పనుల్లో ఎటువంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా పనులు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చేసిన కాంక్రీట్ పనులను కనీసం సక్రమంగా నీటితో తడపకపోవడంతో బీటలు వారుతున్నాయి. మరో వైపు నాసిరకం పనులు చేయడంతో కొద్దిరోజుల్లో చిన్నపాటి వర్షం పడ్డా పూర్తిగా రోడ్డు పాడైపోయే పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు. పంచాయతీరాజ్ అధికారుల పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ పర్యవేక్షణా లోపంతో తక్షణమే ఇప్పటికైనా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఆలయం చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేసి పది కాలాలపాటు ఉపయోగపడేలా చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై పంచాయతీరాజ్ ఇంచార్ ఇంజనీరింగ్ అధికారి రజిత్‌ను కోరగా, ముగ్గురు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలు పనులు జరిగాయన్నారు. తాను రెండు మండలాలకు ఎఇగా బాధ్యతలు చేపట్టడంతో అన్ని పనుల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. అలాగే నాణ్యతా లోపాలు లేకుండా పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు ముందుగానే ప్రభుత్వ నిబంధన ప్రకారం పనులు చేస్తేనే బిల్లులు చెల్లింపులు చేస్తామని లేకపోతే ఎం బుక్కులలో రికార్డులు నమోదు చేయమని తెలిపారు. పనులు చేస్తున్న ప్రదేశంలో తప్పనిసరిగా నీటితో పనులు చేసిన కాంక్రీట్‌కు తడిపేలా కాంట్రాక్టర్‌కు చెప్పి చర్యలు చేపడతామని అన్నారు.



నాణ్యతా లోపంతో నిర్మిస్తున్న రక్షణ గోడ